క్లుప్తంగా

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కార్మిక హక్కులను కాలరాసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలున్నాయని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం పట్ల కార్మికులు రోజు 10గంటలు పనిచేయాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయక తప్పదన్నారు. మే డేలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రేమ్‌కుమార్, వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫయాజ్ మృతి బాధాకరం


ఫయాజ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: జనతా మెడికల్ ఫయాజ్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫయాజ్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనకు మంచి మిత్రుడు అని, ఇలా హఠాత్తుగా ఫయాజ్ మృతిచెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ


ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోంపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సునిత నర్సింగ్ హోంపై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన ఎంఎస్ ప్రియాంక, ఆమె భర్త ప్రకాశం తెలిపారు. ఎంఎస్ ప్రియాంక మాట్లాడుతూ.. 9 నెలలు నిండిన తాను పరీక్షల నిమిత్తం ఈనెల 29న ఆసుపత్రికి వెళ్లగా.. అష్టమి వున్నందున వైద్యురాలు రాదని చెప్పి సిబ్బంది నిర్లక్ష్యం చేశారని ఆరోపించింది. మరుసటి రోజు వెళ్లగా.. పరీక్షించిన డాక్టర్ గర్భంలోనే శిశువు చనిపోయిందని చెప్పి కర్నూలులోని ఓ ప్రైవేట్ అస్పత్రికి పంపారన్నారు. క్రమం తప్పకుండా సునిత నర్సింగ్‌హోమ్‌లోనే తాను వైద్య పరీక్షలు చేయించుకునేదానినని, చివరి రోజుల్లో డాక్టర్ నిర్లక్ష్యం చేసి శిశువు మృతికి కారణమైందని వాపోయింది.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: మండలంలోని చిన్నహరివాణం గ్రామానికి చెందిన లోకన్న(55) కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. చిన్నహరివాణం గ్రామానికి చెందిన లోకన్న ఈనెల 13వ తేదీన పర్వతాపురం గ్రామంలో జరిగిన అల్లయ్య ఉత్సవంలో పాల్గొన్నాడు. రాత్రి ఆలయంపై పడుకొని, ఉదయం లేచి మెట్లు దిగుతుండగా కాలుజారి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గిన్నిస్ బుక్‌లో చెరుకుల పాడు వాసికి చోటు

కర్నూలు కల్చరల్: వెల్దుర్తి మండలంలోని చెరుకుల పాడు గ్రామానికి చెందిన కొమ్ము చిరంజీవులు కాలాంతక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. గతేడాది డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆగస్టీన్, దండింగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా పోటీలు నిర్వహించారు.దేశ విదేశాల నుంచి వేలాది మంది పాల్గొన్న పోటీల్లో చిరంజీవులు కీ బోర్డు ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు పొందా రు. హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులు సర్టిఫికె ట్లు, జ్ఞాపిక అందజేసినట్లు చిరంజీవులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో క్రీస్తు పునరుత్థాన వేడుకలు

- ప్రార్థనా మందిరాలను అలంకరించిన క్రైస్తవులు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గంలోని చర్చిలలో పునరుత్థాన (ఈస్టర్) పండుగను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, విక్టోరియ పేటలోని సీఎస్‌ఐ చర్చి, ఎస్‌కేడీ కాలనీలోని హోలీట్రినిటీ చర్చిలతో పాటు పలు చర్చీలను మల్లెపూలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయమే క్రైస్తవులు ఆయా ప్రార్థనా మందిరాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి బాల యేసు ప్రార్థనా మందిరంలో విచారణ గురువులు రెవరెండ్ కోలా విజయ రాజు, కర్నూలు కేథలిక్ చర్చి గురువులు రెవరెండ్ జార్జి మాట్లాడుతూ మానవాళిని పాపము నుంచి విముక్తి కలిగించడానికి క్రీస్తు ప్రాణత్యాగం చేసి సజీవుడుగా లేచిన దినమే ఈస్టర్ అని తెలిపారు. విక్టోరియ పేటలోని సీఎస్‌ఐ చర్చి పాస్టర్ విలియం సుజిత్, ఎస్‌కేడీ కాలనీలోని హోలీట్రినిటి చర్చిలో పాస్టర్ భరత్, రాయనగర్‌లోని ఎంబీ చర్చిలో పాస్టర్ తిమోతి దైవ సందేశం వినిపించారు. క్రీస్తు భోధనలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సాటి మనిషి పట్ల ప్రేమ, అప్యాయత కలిగి జీవించాలని తెలిపారు.


ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

పెద్దకడబూరులో..

పెద్దకడబూరు : మండల కేంద్రం పెద్దకడబూరుతో పాటు మండలంలోని చిన్నతుంబళం, కల్లుకుంట, బసలదొడ్డి, హెచ్.మురవణి, కంబళదిన్నె, జాలవాడి తదితర గ్రామాలలో ఆదివారం క్రైస్తవులు క్రీస్తు పునరుత్థాన(ఈస్టర్) వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని సీఎస్‌ఐ చర్చ్ పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు ఆధ్వర్యంలో వేకవ జామున చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు అడుగు జాడల్లో నడిచి చేసిన పాపముల నుంచి విముక్తిని పొందాలని బోధించారు.


దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్ భరత్

కోసిగి: మండల కేంద్రం కోసిగితో పాటు వివిధ గ్రామాల్లోని చర్చిలలో క్రిష్టియన్లు ఆదివారం క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసిగిలోని క్రీస్తు సంఘం, ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, దలవ్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీ చర్చిలలో పాస్టర్లు ప్రేమ్‌కుమార్, రాజారత్నం, సుమిత్ర, చిదానంద, శ్రీనివాసులు క్రీస్తు పునరుత్థానం ప్రత్యేకత గురించి వివరించారు. కోసిగితో పాటు మండలంలోని చింతకుంట, పల్లెపాడు, డి.బెళగల్, దుద్ధి, అగసనూరు, వందగల్లు తదితర గ్రామాల్లోని చర్చిలలో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు.


ఆదోని ఆర్‌సీఎం చర్చిలో మాట్లాడుతున్న విచారణ గురువులు రెవ.కోలా విజయరాజు


భక్తి గీతాలు పాడుతున్న బాలికలు


పెద్దకడబూరు గ్రామంలోని సీఎస్‌ఐ చర్చిలో బోధిస్తున్న పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్‌బాబు


ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవులు


కోసిగిలోని సిద్దప్ప పాలెం చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి స్థానిక ప్రజలు, హోటల్ నిర్వాహకులు హాజరయ్యారు. ఫైర్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ అగ్ని పుట్టాలన్నా, మండుటకు కావలసిన వస్తువు, తగిన వేడి, ఆక్సిజన్ మూడు ఉంటే అగ్ని ఉద్భవిస్తుందని తెలిపారు. గ్యాస్ వాడుటలో చాల జాగ్రత్తలు పాటించాలని, వంట చేసేది పూర్తి అయిన వెంటనే సిలిండర్‌కు స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. అనంతరం వాటర్ డెమో, ఫైర్ విన్యాసాలు ప్రదర్శించారు. స్థానిక ప్రజలు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో గ్యాస్ సిలిండర్‌కు మంటలు ఎలా ఆర్పాలో ప్రదర్శన ఇస్తున్న ఫైర్ అధికారి

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి రామాంజనేయులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ సిలిండర్, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీ సంస్కృతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ(వామ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 13 మంది డాక్టర్లు, 25 మంది వైద్య సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రి, నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి, అర్బిట్ డయాగ్నస్టిక్స్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సహకారంతో ప్రముఖ ఎన్నారై కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఇందులో ఉచితంగా ఎముకలు, గుండె, గొంతు, ముక్కు, చెవి వైద్య పరీక్షలను నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 538 మంది రోగులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. అర్హులైన వారికి డాక్టర్ సలహా మేరకు రూ.2500 విలువైన 2డీ ఎకో టెస్ట్, ఈసీజీ, బీపీ, షుగర్, టీఎస్‌టీ మొదలైన పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 86 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తమై శాంతిరామ్ ఆసుపత్రికి రెఫర్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, మనోజ్, డాక్టర్ రాజేష్‌రెడ్డి, ఫక్రుద్దీన్, సురేష్, అవోపా కార్యదర్శి రఘు, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి లేని వాహనాలు నడిపితే చర్యలు


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ హనుమంతరెడ్డి

కోసిగి: వాహనాలకు అనుమతులు లేకుండా నడిపితే కఠిన చర్యలు తప్పవని కోసిగి ఎస్‌ఐ హనుమంత రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక మౌంట్ కార్మెల్ స్కూల్ సమీపంలో డి. బెళగల్ రోడ్డు మీదుగా వస్తున్న వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆటో డ్రైవర్లుకు, వాహనదారులకు సైబర్ స్మార్ట్, రోడ్డు సేఫ్టిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక వాహన పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని తీసుకురావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు.

రేపటి లోగా సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజును 22వ తేదీ లోపు చెల్లించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న ఆదివారం తెలిపారు. అలాగే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కూడా ఈ నెల 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రీ కౌంటింగ్‌కు రూ. 260లు, రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపరుకు రూ.1300 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ఫీజులు మాత్రం సబ్జెక్టును బట్టి, ఒక్కొక్క గ్రూపుకు ఒక్కో విధంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు గమనించి సకాలంలో ఫీజులను చెల్లించాలని వారు కోరారు.

ధోబీ పోస్టులను రజకులకే కేటాయించాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను రజకులకే కేటాయించాలని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సి.సావిత్రి తెలిపారు. ఆదివారం కర్నూలు పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. మన పక్క రాష్ట్రం తెలంగాణలో మాదిరిగా మన రాష్ట్రంలో బట్టలు ఉతికే పోస్టులను రజక సోదరులకే ఇవ్వాలని కోరారు. దీంతో నిరుద్యోగులైన యువకులకు ఉపాధి కల్పించిన వారవుతారని తెలిపారు.

28న అమకతాడులో క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈ నెల 28వ తేదీ నుంచి సూపర్ 8 క్రికెట్ (హోం టీమ్స్) టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సాయంతో వరుసగా రూ.20వేలు, రూ. 15 వేలు, రూ. 10వేలు అందించడంతోపాటు బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్‌కు కూడా షీల్డ్ అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 26వ తేదీలోగా రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 8466832839, 6302115162 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


గురజాలలో వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్న అన్నదాతలు

అకాల వర్షం.. రైతన్నకు నష్టం

- గాలులకు నేలవాలిన వరి పైరు
- పంటలను కాపాడుకోవాడానికి అన్నదాతల అవస్థలు

నందవరం: అకాల వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షాలకు పంటలు దెబ్బతింటుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటలు నేలరాలుతున్నాయి. కోత కోసిన పంటలు వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో నాగలదిన్నె, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జోహరాపురం, గంగవరం. రాయచోటి, నదికైరవాడి తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. ప్రస్తుతం కొందరు రైతులు వరి, మొక్కజొన్న, మిరప పంటలను కోత కోసుకుని కళ్లాల్లో ఆరబోసుకున్నారు. అకాల వర్షానికి వరి ధాన్యం, మొక్కజొన్న గింజలు, ఎండు మిర్చి తడిసిపోకుండా పట్టలు కప్పుకుంటూ అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. తడిస్తే ధాన్యం, మొక్కజొన్న, ఎండు మిర్చి దెబ్బతీంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉరుములు, మెరుపులు, గాలులుతో కూడిన వర్షం పడడంతో చిన్నకొత్తిలి, జొహరాపురం తదితర గ్రామాలలో అక్కడక్కడ వరి పైరు నేలకొరిగింది.


జోహరాపురంలో నేలకొరిగిన వరి పైరు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండ గ్రామంలో వెలసిన శివాలయం, సుంకులమ్మవ్వ ఆలయాల్లో ఆదివారం గణపతి, పార్వతి, సుబ్రహ్మణ్య స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు గరుడాద్రి రామసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో గంగ పూజ, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు పార్వతీదేవికి ఒడి బియ్యం సమర్పించారు. పూజల్లో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పూలమాలలతో సన్మానించి మేళతాళాలతో స్వాగతం పలికారు. సర్పంచ్ బిటి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రంగన్న, వీరేష్, సుదర్శన్, కృష్ణ, రమణయ్య, నరసింహులు పాల్గొన్నారు.


బైలుపత్తికొండలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠించిన దృశ్యం

జాగ్రత్తలే పశువులకు రక్ష

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పశువులు వడదెబ్బ బారినపడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే మేతకు తీసుకెళ్లాలి

పెద్దకడబూరు : వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18 – 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. ఆపై అధిక ఉష్ణోగ్రతలు నమోదయితే పశువులు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రధానంగా వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటం ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు పైగానే నమోదవుతుండటంతో పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక మెలకువలు పాటించాలి. వేసవిలో పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు.


పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

వడదెబ్బ తగలకుండా ..

సాధారణంగా పశువులను మేతకోసం అడవులకు, పొలాల్లోకి తీసుకెళ్తుంటారు. వేసవికాలంలో ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయంలో ఎండలో ఉండడం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి కొట్టుకోవడం వేగంగా పెరుగుతుంది. కొన్ని సమయాల్లో అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి. వాటిని చల్లని శుభ్రమైన నీటితో కడగాలి. షెడ్ చుట్టూ నీటితో తడిపిన గోనె సంచులను లేదా బట్టలను ఏర్పాటు చేయాలి. మరీ ముఖ్యంగా ఎండలను దృష్టిలో పెటుకొని ఉదయం 6 నుంచి 11గంటల వరకు అవసరం అయితే సాయంత్రం 4 నుంచి 6గంటల మధ్య కాలంలోనే పశువులను మేత కోసం భయటకు తీసుకెళ్లాలి. ఎండ సమయాల్లో వాటికి విశ్రాంతి ఇవ్వడం ఎంతో మంచిది. రైతుల ఆర్థిక స్థోమతను బట్టి షెడ్‌లలో ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలి.

వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది

వేసవిలో పశువులకు కావాల్సిన మేత సరీగా దొరకదు. దీంతో పాటు ఎండలు మండిపోతుండడంతో అటవీ ప్రాంతంలో నీరు ఉండదు. ఉన్నా కలుషితం అయ్యి ఉంటుంది. దీనివల్ల పోషకాహార లోపాలతో వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. దీని కారణంగా గొంతువాపు, గాలికుంటు వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాల్సి ఉంటుంది. అంతర, బాహ్యపరాన్న జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల్యమైన పోషకాలు కలిగిన ఆహారాన్ని, శుభ్రమైన తాగునీరు తగిన మోతాదులో పశువులకు అందించాలి.

నీరు, ఆహారాన్ని తగినంతగా అందించాలి



సాధారణంగా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ముఖ్యంగా ఈ సంవత్సరం వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉంది. వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తీసుకొని ఆహారాన్ని తక్కువగా తీసుకుంటాయి. వాటికి తాగునీరు పరిశుభ్రంగా, పుష్కలంగా ఉండే విధంగా చూసుకోవాలి. ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి పూట పచ్చిగడ్డి, దాణా మిశ్రమాన్ని అందించి రాత్రి సమయాల్లో ఎండుగడ్డిని ఇవ్వాలి. ఎండలో ఎక్కువ తిప్పకుండా జగ్రత్త పడాలి. ఎండతీవ్రతకు గురైనట్లు అనిపిస్తే ప్రథమ చికిత్స అందించడంతో పాటు డాక్టరు సూచనలు పాటించాలి.

–డాక్టర్ కే.దినాకర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పెద్దకడబూరు

దేవరగట్టులో భక్తి శ్రద్ధలతో పూజలు

హొళగుంద: దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగ పూజారులు ఆలయంలో మూలమూర్తులకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళహారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి అంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు.


మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న భక్తులు